క్లుప్తంగా

మాజీ జెడ్పీటీసీ తల్లి రాజమ్మ మృతికి సంతాపం



రమేష్ రెడ్డిని పరామర్శిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

చంద్రగిరి: చంద్రగిరి మాజీ జెడ్పీటీసీ వీరంగారి రమేష్ రెడ్డి తల్లి రాజమ్మ(95) మృతి చెందారు. ఆమెకు తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి శుక్రవారం సంతాపం తెలిపారు. రమేష్ రెడ్డి ఇంటి వద్దకు చేరుకుని ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల: శ్రీవారిని శుక్రవారం పోస్ట్ పార్లమెంట్ స్టాండింగ్ కమిటీ చైర్మన్ ప్రతాప్ జాదవ్, బాలీవుడ్ హీరో అనిల్ కపూర్ దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. అనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం అందించగా అధికారులు లడ్డు, ప్రసాదాలతో సత్కరించారు.

నాగవిహారికి డాక్టరేట్



తిరుపతి సిటీ : ఎస్వీయూ స్టాటిస్టిక్స్ విభాగం పరిశోధక విద్యార్థి కె.నాగవిహారికి డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి దామ్లా నాయక్ తెలిపారు. ఆయన ప్రొఫెసర్ ఆర్.అబ్బయ్య పర్యవేక్షణలో స్టాటిస్టికల్ క్రిటేరియా ఫర్ సెలెక్షన్ ఆఫ్ ఫంక్షనల్ ఫామ్స్ ఇన్ రిగ్రేషన్ అనాలసిస్ అనే అంశంపై పరిశోధన చేశారు.

జాబ్‌మేళాలో 45 మందికి ఉద్యోగాలు



అభ్యర్థులను ఇంటర్వ్యూ చేస్తున్న కంపెనీల ప్రతినిధులు

తిరుపతి సిటీ : ఎస్వీ యూనివర్సిటీ ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన జాబ్ మేళాలో 45 మంది ఎంఎన్‌సీ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు. ఏడు ప్రముఖ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇందులో ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి 173 మంది నిరుద్యోగులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంప్లాయ్‌మెంట్ కార్యాలయ అధికారి టి.శ్రీనివాసులు మాట్లాడుతూ పేటీఎం, అపోలో, మెడిప్లస్, ఐడీబీఐ బ్యాంక్ వంటి పెద్ద సంస్థలు జాబ్‌మేళాలో పాల్గొని ఇంటర్వ్యూలు నిర్వహించినట్లు తెలిపారు. 45 మంది ప్రతిభ చూపి ఉద్యోగాలు సాధించారని తెలిపారు.

రుయాలో పారిశుద్ధ్య లోపం

తిరుపతి తుడా: తిరుపతి రుయాలో పారిశుద్ధ్యం లోపించడంపై రుయా అభివృద్ధి వర్కింగ్ కమిటీ చైర్మన్ బండ్ల చంద్రశేఖర్ రాయల్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన శుక్రవారం రుయా పరిపాలన భవనం వెనుకవైపు ఉన్న పలు వార్డుల్లో పర్యటించారు. అక్కడ మురుగు నీరు నిలవడంతో దుర్గంధం వెదజల్లుతోంది. ఎక్కడికక్కడే చెత్త కుప్పలు పేరుకుపోవడంపై మండిపడ్డారు. ఆయన మాట్లాడుతూ రుయాలో పారిశుద్ధ్యం లోపంపై ఇప్పటికే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశామన్నారు. అయినా కాంట్రాక్టు సంస్థ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే భూమన కరుణాకరరెడ్డి అధ్యక్షతన జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగే అభివృద్ధి కమిటీ సమావేశంలో శానిటేషన్ నిర్లక్ష్యంపై గట్టిగా నిలదీస్తానని చెప్పారు. పారిశుద్ధ్య లోపం కనిపిస్తున్నా కొంతమంది అధికారులు, సిబ్బంది కాంట్రాక్టర్‌కు కొమ్ముకాస్తూ పూర్తిస్థాయిలో మార్కులు వేస్తూ నెలవారీ వేతనాలు మంజూరు చేస్తున్నారని ఆరోపించారు. ఈ విషయాలన్నీ త్వరలో ఆధారాలతో సహా బయట పెడతానని హెచ్చరించారు.

రాయల జయంతిని అధికారికంగా నిర్వహించాలి

తిరుపతి కల్చరల్: తిరుమలను అభివృద్ధి చేసి, ఏడు సార్లు స్వామివారికి బంగారు ఆభరణాలు సమర్పించిన శ్రీకృష్ణ దేవరాయల జయంతిని టీటీడీ అధికారంగా నిర్వహించాలని రాయల్ పీపుల్స్ ఫ్రంట్ వ్యవస్థాపకుడు తిరుమలశెట్టి రెడ్డిశేఖర్ విజ్ఞప్తి చేశారు. ఆయన శుక్రవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. తిరుపతి, తిరుమల, శ్రీకాళహస్తి తదితర ప్రాంతాల్లో అనేక దేవాలయాల నిర్మాణంలో రాయుల వారి కృషి ఉందన్నారు. రాయల చెరువు, పేరూరు చెరువులో రాయుల వారి అతి పెద్ద విగ్రహంతో కూడిన స్మారక చిహ్నం ఏర్పాటు చేయాలని కోరారు. తిరుమలలో అన్ని కుల సంఘాల తరహాలో బలిజ, కాపు, తెలగ, ఒంటరిలకు శ్రీకృష్ణ దేవరాయల భవన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వేణు రాయల్, రఘు రాయల్, నాగరాజురాయల్ గిరికుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ఆరోగ్యమే జగనన్న సురక్ష లక్ష్యం



ప్రజలకు వైద్య పరీక్షలు చేస్తున్న మేయర్ శిరీష

తిరుపతి తుడా: రాష్ట్ర ప్రజలను ఆరోగ్యంగా ఉంచడమే జగనన్న ఆరోగ్య సురక్ష ప్రధాన లక్ష్యమని మేయర్ డాక్టర్ శిరీష తెలిపారు. నగరంలోని 1, 6 డివిజన్లలోని ప్రజల కోసం శుక్రవారం తిరుమలరెడ్డి నగర్‌లోని పీహెచ్‌సీలో జగనన్న ఆరోగ్య సురక్ష మెడికల్ క్యాంప్ నిర్వహించారు. ఇందులో మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ పాల్గొన్నారు. మేయర్ శిరీష స్వయంగా వైద్య పరీక్షలు చేశారు. డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణకు కంటి పరీక్షలు చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటికీ వలంటీర్, ఆరోగ్య కార్యకర్తలు వెళ్లి వైద్య పరీక్షలు చేస్తారని తెలిపారు. ఏవైనా సమస్యలు ఉంటే వారికి టోకెన్ అందజేస్తారన్నారు. అనారోగ్య సమస్యలు ఉన్నవారికి ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాల్లో నాణ్యమైన వైద్యాన్ని అందిస్తున్నామని చెప్పారు. కమిషనర్ హరిత మాట్లాడుతూ వచ్చే నెల 14వ తేదీ వరకు వైద్య శిబిరాలు కొనసాగుతాయన్నారు. ఈ శిబిరంలో సుమారు 700 మంది వైద్య సేవలు పొందారని ఆమె తెలిపారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ శ్రీహరి, మునిసిపల్ కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, వెటర్నరీ ఆఫీస్ డాక్టర్ నరేంద్ర రెడ్డి, డీఈ విజయకుమార్ రెడ్డి, స్థానిక కార్పొరేటర్ అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య వరప్రసాదిని జగనన్న ఆరోగ్య సురక్ష

తిరుపతి రూరల్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం గ్రామీణుల పాలిట ఆరోగ్య ప్రసాదిని అని అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ అరుణసులోచనదేవి తెలిపారు. తిరుపతి రూరల్ మండలం దుర్గసముద్రం సచివాలయం పరిధిలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించారు. 452 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మెడికల్ ఆఫీసర్లు నీలిమ, పద్మజ, ప్రజాప్రతినిధులు, గ్రామస్తులు, వైద్య, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పేదలకు రక్ష.. జగనన్న ఆరోగ్య సురక్ష

చంద్రగిరి: మండలంలోని ఐతేపల్లి పంచాయతీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం సర్పంచ్ ఫాజిలా అధ్యక్షతన నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి విశేష స్పందన లభించింది. సుమారు 400 మంది ప్రజలు వైద్య శిబిరానికి చేరుకుని బీపీ, షుగర్, థైరాయిడ్, కాళ్ల నొప్పులు, కీళ్ల నొప్పులు, జ్వరాలు, కంటిచూపు తదితరాలకు పరీక్షలు చేయించుకున్నారు. వారికి వైద్య సిబ్బంది ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. అనంతరం ఎస్సీ, ఎస్టీ పథకం కింద 100 మందికి ఆయుష్మాన్ భారత్ కార్డులు అందజేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ శిరీష, ఎంపీడీవో రమేష్‌బాబు పాల్గొన్నారు.

జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా కార్పొరేట్ వైద్యం

భాకరాపేట : జగనన్న ఆరోగ్య సురక్ష ద్వారా ప్రజలకు కార్పొరేట్ వైద్యాన్ని ఉచితంగా అందిస్తున్నట్లు చిన్నగొట్టిగల్లు ఎంపీడీవో దేవేంద్రబాబు పేర్కొన్నారు. దీన్‌దార్లపల్లె పంచాయతీలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వైద్య శిబిరాల్లో ప్రజలకు వైద్య పరీక్షలు చేసి రోగాలు ఉన్న వారిని గుర్తించి మెరుగైన వైద్యం కోసం పెద్దాసుపత్రులకు పంపుతామన్నారు. అవసరమైన మందులను వారి ఇంటికే చేరుస్తామన్నారు. కార్యక్రమంలో వైద్యులు తేజస్వి, అలెగ్జాండర్, మురళీమోహన్, రేవతి, ఈవోపీఆర్డీ సోమశేఖర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి రామ్మోహన్ పాల్గొన్నారు.





దుర్గసముద్రంలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌వో అరుణసులోచనదేవి, కళ్లద్దాలు అందజేస్తున్న ఎంపీపీ హేమేంద్ర కుమార్ రెడ్డి, రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

త్వరితగతిన కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులు



కమిషనర్ హరిత

తిరుపతి తుడా : అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో నగరంలో ఏర్పాటు చేస్తున్న ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని స్మార్ట్ సిటీ ఎండీ, నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. ఆమె శుక్రవారం ఇంజినీరింగ్, ఏఈకామ్, కాంట్రాక్టు సంస్థ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఆమె మాట్లాడుతూ నగరంలో ఏ మూలన ఏమి జరిగినా క్షణాల్లో తెలిసే విధంగా సెంటర్ పనిచేస్తుందన్నారు. అలాగే వాహనాల రాకపోకల నియంత్రణ, నగరంలో కాలుష్య నియంత్రణ, యూజర్ చార్జీల వసూళ్లు, అపరాధ రుసుము విధింపు వంటి కార్యక్రమాలు ఈ సెంటర్ ద్వారా చేపట్టనున్నట్టు చెప్పారు. ఎస్‌ఈ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, స్మార్ట్ సిటీ జనరల్ మేనేజర్ చంద్రమౌళి, ఏఈకామ్ ప్రతినిధి బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

21న ప్రత్యేక లోక్ అదాలత్

తిరుపతి లీగల్ : తిరుపతి కోర్టు ఆవరణలో ఈ నెల 21వ తేదీన ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించనున్నట్టు తిరుపతి మూడో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయ సేవా అధికార సంస్థ చైర్మన్ గురునాథ్ తెలిపారు. ఇందులో మోటారు వాహన ప్రమాదాలు, రెవెన్యూ తదితర కేసులను పరిష్కరించనున్నట్టు పేర్కొన్నారు. ఇందుకోసం 11 ప్రత్యేక బెంచులను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. రెవెన్యూ, బీమా సంస్థల అధికారులు, న్యాయవాదులు పాల్గొని అధిక సంఖ్యలో కేసులు పరిష్కారమయ్యేలా సహకరించాలని కోరారు.

తిరుమల పవిత్రతను కాపాడడం అందరి బాధ్యత



సమావేశంలో మాట్లాడుతున్న ఈవో ధర్మారెడ్డి

తిరుమల: శ్రీవారి ఆలయ పవిత్రత, విశిష్టతను కాపాడడం అందరి బాధ్యత అని టీటీడీ ఈవో ధర్మారెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం డయల్ యువర్ ఈవో కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులు అడిగిన ప్రశ్నలకు సమాధానాలు ఇచ్చారు. నగరికి చెందిన ప్రకాష్ అనే భక్తుడు మాట్లాడుతూ తిరుమలలోని కొందరు మీడియా ప్రతినిధులు రాజకీయ నాయకులను రాజకీయ పరమైన ప్రశ్నలు అడుగుతున్నారని తెలిపారు. రాజకీయ నాయకులు ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రంలో రాజకీయ విమర్శలు చేయడం బాధాకరమన్నారు. మీడియా ప్రతినిధులు రాజకీయ ప్రముఖులను వారి ఆధ్యాత్మిక అనుభూతులను గురించి ప్రశ్నలు వేస్తే బాగుంటుందని సూచించారు. తిరుమల పవిత్రతను కాపాడటంలో ప్రతి ఒక్కరూ టీటీడీకి సహకారం అందించాలని ఈవో కోరారు.

ప్రశ్న : తమిళనాడు నుంచి నడిచి వస్తున్న భక్తులకు బ్రహ్మోత్సవాల్లో ప్రత్యేకంగా గ్యాలరీ, సౌకర్యాలు ఏర్పాటు చేయండి. – **ప్రకాష్, నగరి**

ఈవో : గ్యాలరీలలో ఎవరైనా కూర్చోవచ్చు.

ప్రశ్న : వైకుంఠ ఏకాదశి పర్వదినాలకు దర్శన టికెట్లు ఎప్పుడు విడుదల చేస్తారు.

– **శ్రీహరి, ప్రకాశం**

ఈవో : డిసెంబర్ 23 నుంచి 2024 జనవరి 1వ తేదీ వరకు 2 లక్షల వైకుంఠ ఏకాదశి దర్శన టికెట్లను త్వరలో ఆన్ లైన్‌లో విడుదల చేస్తాం. అదేవిధంగా 5 లక్షల టికెట్లు ఆఫ్‌లైన్‌లో ఇస్తాం.

ప్రశ్న : అంగప్రదక్షిణ టికెట్లు 3 నెలలు ముందుగా విడుదల చేస్తున్నారు. మహిళలకు ఇబ్బందిగా ఉంది, కావున ఆఫ్‌లైన్‌లో ఇవ్వండి. – **అనిత, చిత్తూరు**

ఈవో : అంగప్రదక్షిణ టికెట్ల కోటా పరిమితంగా ఉంటుంది. ఆఫ్‌లైన్‌లో ఎక్కువమంది క్యూలో వేచి ఉండడం వల్ల ఇబ్బంది పడుతున్నారు. కావున ఆన్‌లైన్‌లోనే బుక్ చేసుకోండి.

ప్రశ్న : నిజపాద దర్శనం టికెట్ ఆన్‌లైన్ లక్కీ డిప్‌లో ఇవ్వండి. – **పద్మావతి, తుని**

ఈవో : శుక్రవారం అభిషేకం, అలంకరణ కారణంగా నాలుగు గంటల సమయం పడుతోంది. భక్తులు దర్శనం కోసం అధిక సమయం వేచి ఉంటారు. నిజపాద దర్శనం కోసం మరికొంత సమయం కావాల్సి ఉంటుంది. దీంతో శుక్రవారం నిజపాద దర్శనాలను టీటీడీ బోర్డు రద్దు చేసింది.

ఆత్మీయతను పంచుతూ...అభివృద్ధిని వివరిస్తూ



సాయినగర్‌లో ప్రజలతో మాట్లాడుతున్న చెవిరెడ్డి లక్ష్మి

తిరుపతి రూరల్: ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి చెవిరెడ్డి లక్ష్మి శుక్రవారం తిరుపతి రూరల్ మండలం సాయినగర్ పంచాయతీలో గడప గడపకూ ఆత్మీయ పలకరింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రతి గడపకూ జగనన్న ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాలు, ఎమ్మెల్యే చెవిరెడ్డి చేసిన అభివృద్ధి పనులను వివరించారు. చేసిన మేలును గుర్తుంచుకుని వచ్చే ఎన్నికల్లో తన బిడ్డ చెవిరెడ్డి మోహిత్ రెడ్డిని ఎమ్మెల్యేగా ఆదరించాలని విజ్ఞప్తి చేశారు.

రూ.10 కోట్లతో అభివృద్ధి పనులు

సాయినగర్ పంచాయతీలో రూ.10 కోట్లతో అనేక అభివృద్ధి పనులు చేసిన ఘనత ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డికి దక్కుతుందని సర్పంచ్ డీవీ రమణ వివరించారు. అలాగే జగనన్న ప్రభుత్వం నుంచి రూ.12 కోట్ల మేరకు సంక్షేమ పథకాలు కింద లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ సోమశేఖర్‌రెడ్డి, ఎంపీటీసీ వినోద్, శ్రీరాములురెడ్డి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లా జట్ల ఎంపిక



త్రోబాల్ జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

తిరుపతి ఎడ్యుకేషన్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతిలోని ఎస్‌పీజేఎన్‌ఎం పాఠశాల క్రీడా మైదానంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా అండర్-19 టెన్నికాయిట్, త్రోబాల్, బాల్ బ్యాడ్మింటన్, సెపక్‌తక్రా, రెజ్లింగ్ జిల్లా జట్ల ఎంపిక పోటీలు జరిగాయి. బాలబాలికలకు వేర్వేరుగా పోటీలు నిర్వహించి ప్రతిభ చూపిన వారిని జిల్లా జట్లుకు ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ అండర్-19 కార్యదర్శి ఎస్.జయరామయ్య తెలిపా రు. ఎంపికైన జిల్లా జట్లు రాష్ట్రస్థాయి పోటీల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు ప్రాతినిధ్యం వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మునిశేఖర్, సెలక్షన్ కమిటీ సభ్యులు, వ్యాయామ ఉపాధ్యాయులు విజయలక్ష్మి, వెంకటరమణారెడ్డి, మురళీధర్‌రెడ్డి, నాగరాజు, ఏజీ.రేఖారాణి, సుధ, అమ్ములు, సుధాకర్, సురేంద్రా రెడ్డి, మణికుమార్, నరేంద్ర, కరుణాకర్ పాల్గొన్నారు.



బాల్ బ్యాడ్మింటన్ జట్టుతో నిర్వాహకులు



టెన్నికాయిట్ జట్టు క్రీడాకారులతో నిర్వాహకులు

సరికొత్త బజాజ్ పల్సర్ ఎన్ 150 బైక్ విడుదల



తిరుపతి కల్చరల్: రేణిగుంట రోడ్డులోని శ్రీరామ్‌బజాజ్ ఎంటర్‌ప్రైజెస్ షోరూంలో శుక్రవారం సరికొత్త బజాజ్ పల్సర్ ఎన్150 బైక్‌ను విడుదల చేశారు. ఇందులో ముఖ్య అతిథిగా ఎస్‌బీఐ డీజీఎం ఆర్.వరదరాజన్ పాల్గొన్నారు. శ్రీరామ్ బజాజ్ మేనేజింగ్ పార్ట్‌నర్ శ్రీనివాసరావు మాట్లాడుతూ గత 20 ఏళ్ల క్రితం తాము మొదటి పల్సర్ 150 సీసీ మోటార్ సైకిల్‌ను విడుదల చేశామని తెలిపారు. అప్పటి నుంచి దేశవ్యాప్తంగా అత్యధికంగా 150 సీసీ బైక్‌ల విక్రయాలు సాగుతున్నాయని తెలిపారు. ప్రస్తుతం సరికొత్త టెక్నాలజీతో ఎన్150 పల్సర్ అందుబాటులోకి వచ్చిందన్నారు. మరో మేనేజింగ్ పార్ట్‌నర్ సాకేత్ రామ్ మాట్లాడుతూ ఈ బైక్ డిజైన్ లాంగ్వేజ్ శక్తివంతమైన, ఉత్సాహపూరితమైన క్యారెక్టర్ లైన్స్, టైటర్ ప్రొపోర్షన్స్, ఆధునిక ఏరో డైనమిజం కలిగి ఉందన్నారు. సింగల్ ఛానల్ ఏబీఎస్ అత్యుత్తమ బ్రేకింగ్ నియంత్రణ, ట్రాక్షన్‌ను అందజేస్తుందన్నారు. రేసింగ్ రెడ్, ఎబోనీ బ్లాక్, మెటాలిక్ పెరల్ వైట్ రంగుల్లో బైక్ అందుబాటులో ఉందని తెలిపారు.

గడప గడపలోనూ సంక్షేమ వెలుగులు



గొర్రెల కాపరికి భరోసా ఇస్తున్న చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి

రామచంద్రాపురం: జగనన్న ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ పథకాలతో ప్రతి గడపలోనూ వెలుగులు నిండాయని ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి తనయుడు చెవిరెడ్డి హర్షిత్‌రెడ్డి తెలిపారు. ఆయన శుక్రవారం కొత్తకండ్రిగ పంచాయతీలో గడప గడపకూ మీ హర్షిత్ కార్యక్రమం నిర్వహించారు. ప్రతి గడపకూ వెళ్లి సంక్షేమ పథకాల జాబితాను లబ్ధిదారులకు అందజేశారు. వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆయన మాట్లాడుతూ కొత్తకండ్రిగ పంచాయతీలో రూ.2.50 కోట్లతో అభివృద్ధి పనులు చేపటినట్లు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిని ఎమ్మెల్యేగా ఆదరించి గెలిపించాలని కోరారు. ఎంపీపీ ఏవీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ ఢిల్లీరాణి, ఆర్సీపురం ఇన్‌చార్జి గణపతి నాయుడు, సుధాకర్‌రెడ్డి, జిల్లా అగ్రి అడ్వైజరీ బోర్డు చైర్మన్ రఘునాథరెడ్డి, రమేష్ రెడ్డి, కేశవులు నాయుడు, సురేంద్రరెడ్డి, ప్రకాష్ నాయుడు పాల్గొన్నారు.

సమాజహితం దిశగా నడక సేవలు

- తిరుపతి నగరంలో 14 వాకర్స్ సంఘాలు
- 16 వేల మంది సభ్యులు
- 1995న ప్రారంభమైన ఆరోగ్య నడక- స్వచ్ఛంద సేవ
- 38 ఏళ్లుగా విస్తృత సమాజ సేవలు



పేదలకు దుప్పట్లు పంపిణీ చేస్తున్న రామచంద్ర పుష్కరిణి వాకర్స్



గోవిందధామానికి రూ.2.16 లక్షలు ఇస్తున్న గోవిందరాజ వాకర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

తిరుపతి కల్చరల్: నేటి ఆధునిక ప్రపంచంలో మనిషి కాలంతో పోటీ పడాల్సి వస్తోంది. ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు తీవ్ర ఒత్తిడితో పరుగులు తీస్తున్నాడు. దీంతో తన ఆరోగ్యం గురించి పట్టించుకోవడం లేదు. నడకతో మానసిక ఒత్తిడిని తగ్గించుకుని ఆరోగ్యాన్ని పెంపొందించుకోవచ్చని వైద్యులు చెబుతుంటారు. ఈ క్రమంలో తిరుపతి వేదికగా 1995లో వాకర్స్ అసోసియేషన్ ఏర్పాటైంది. తర్వాత పలు అసోసియేషన్లు ఏర్పాటై ప్రస్తుతం 14 సంఘాలు ఉన్నాయి. వాటిలో సుమారు 16 వేల మంది సభ్యులు వాకర్స్‌గా కొనసాగుతున్నారు. ఇందులో సామాన్యుడి మొదలు వైద్యులు, న్యాయవాదులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు, విశ్రాంత ఉద్యోగులు, పారిశ్రామిక వేత్తలు సైతం ఉన్నారు. వారు నడకతోపాటు సొంత ఖర్చులతో నిత్యం సేవా కార్యక్రమాలు చేపడుతూ సమాజ శ్రేయస్సుకు తమ వంతు కృషి చేస్తున్నారు. మానవీయత మూర్తీభవించి దాతృత్వ గుణంతో పోటీ పడి సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆదర్శంగా నిలుస్తున్నారు.

ఆధ్యాత్మిక నగరంలో నడక పుట్టిక ఇలా

నడక ఆరోగ్యాన్ని ఇస్తుందన్న విషయాన్ని గ్రహించిన మాజీ ఐఏఎస్ అధికారి రామిరెడ్డి 1995లో మొట్టమొదటి సారిగా టీటీడీ పరిపాలనా భవనం పార్క్ వద్ద ఇద్దరు, ముగ్గురితో వాకింగ్‌ను ప్రారంభించారు. దీన్ని గుర్తించిన అప్పటి ఉన్నత ఉద్యోగులు ఒక్కొక్కరుగా వారితో జత అయ్యారు. తర్వాత వాకింగ్ చేసే వారి సంఖ్య పెరిగింది. రామిరెడ్డి అధ్యక్షతన వాకర్స్ అసోసియేషన్ ఏర్పాటైంది. అలా మొదలైన వాకర్స్ అసోసిషన్ నగరమంతా విస్తరించి ప్రస్తుతం 14 సంఘాలున్నాయి. వాటిలో తిరుపతి వాకర్స్ అసోసియేషన్, గోవిందరాజ వాకర్స్ అసోసియేషన్, రామచంద్ర పుష్కరిణి అసోసియేషన్, ఎస్వీయూ స్టేడియం వాకర్స్ అసోసియేషన్, ప్రకాశం మున్సిపల్ పార్క్ అసోసియేషన్, బాబూ జగ్జీవన్‌రామ్ పార్క్ వాకర్స్ అసోసియేషన్, శ్రీనివాసపురంలో శ్రీనివాస తుడా పార్క్ అసోసియేషన్, గొల్లవానిగుంటలో శివగణేష్ వాకర్స్ అసోసియేషన్, దివ్యారామం వాకర్స్ అసోసియేషన్, శ్వేతా వాకర్స్ అసోసియేషన్, పద్మావతిపురం వాకర్స్, కరకంబాడి రోడ్డు వినాయక సాగర్‌లో వినాయక సాగర్ వాకర్స్, అవిలాల చెరువు వాకర్స్ అసోసియేషన్ ఉన్నాయి. వాటిలో సుమారు 16 వేల మందికిపైగా నడక సాగిస్తూ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు అవుతున్నారు. వీరు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తూ ప్రతి వారం ప్రముఖ వైద్య నిపుణులను పిలిపించి కాలానికనుగుణంగా వస్తున్న జబ్బుల గురించి తెలు సుకోవడంతో పాటు వాటి నివారణ చర్యలు చేపడుతున్నారు. అదేవిధంగా విద్యార్థులు, వృద్ధులు, అనాథలు, పేదల కోసం పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. పేద విద్యార్థులకు ఫీజులు, వికలాంగులకు వీల్ చైర్స్ అందజేస్తున్నారు. వృద్ధాశ్రమాలకు సాయం చేయడంతో పాటు నిరాశ్రయులకు దుప్పట్లు పంపిణీ చేస్తున్నారు.

సకాలంలో వినతులకు పరిష్కారం చూపాలి



వినతులు స్వీకరిస్తున్న జేసీ డీకే బాలాజీ

రామచంద్రాపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు సకాలంలో పరిష్కారం చూపాలని జిల్లా జాయింట్ కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. ఆయన శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో మండల స్థాయిలో జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు స్వీకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేయించారు. వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఆయన మాట్లాడుతూ రెవెన్యూకు సంబంధించి 16, రోడ్లు, భవనాలకు 3, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్‌కు 3, పంచాయతీ రాజ్, ఇంజినీరింగ్ శాఖ, పోలీస్, గ్రామీణ నీటిపారుదల, ల్యాండ్ అండ్ సర్వేకు ఒక్కొక్కటి చొప్పున వినతులు వచ్చినట్టు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ బ్రహ్మానందరెడ్డి, జెడ్పీటీసీ ఢిల్లీరాణి, తహసీల్దార్ చిన్న వెంకటేశ్వర్లు, ఎంపీడీవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు చోట్ల రెండు రోడ్డు ప్రమాదాలు



ప్రమాదంలో జాతీయ రహదారిపై బోల్తా పడిన కారు

చంద్రగిరి: మండలంలో శుక్రవారం జరిగిన వేర్వేరు ప్రమాదాల్లో ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి. తిరుపతికి చెందిన మహ్మద్ రఫీ, అతని భార్య ఎలిజబెత్ శుక్రవారం ఉదయం కారులో చిత్తూరు బయలుదేరారు. ముంగళిపట్టు సమీపంలో డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో కారు డివైడర్‌ను ఢీకొంది. కారు పల్టీలుకొట్టుకుంటూ తిరుపతికి వెళ్లే రహదారిపై బోల్తా పడింది. దంపతులు ఇద్దరూ స్వల్ప గాయాలతో బయటపడ్డారు. అదే విధంగా తిరుపతి నుంచి బెంగళూరుకు 20 మంది ప్రయాణికులతో ప్రైవేటు ట్రావెల్ బస్సు బయల్దేరింది. పనపాకం వద్ద చిత్తూరు నుంచి తిరుపతికి వస్తున్న లారీ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో ఎవరికి గాయాలు కాలేదు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని రోడ్డుకు అడ్డుగా ఉన్న వాహనాలను తొలగించారు. ఈ మేరకు కేసును దర్యాప్తు చేస్తున్నారు.